సాక్షి నిర్మల్

శుక్రవారం । 6 । అక్టోబర్ । 2023



‘దేవరకోట’ హుండీ లెక్కింపు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దేవరకోట శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీని గురువారం లెక్కించగా రూ.2,10,565 ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్ తెలిపారు.



జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ

నిర్మల్‌రూరల్: ఈ నెల 2 నుంచి 5 వరకు ఆదిలాబాద్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో జిల్లా కేంద్రంలోని ఎంజేపీ విద్యార్థినులు సత్తా చాటారు. 800 మీటర్ల పరుగులో గీత తృతీయ, 200 మీటర్ల పరుగు పందెంలో ఎం.సుజాత తృతీయ స్థానం సాధించారు.

గరిష్టం/కనిష్టం
33.0 /22.0

వాతావరణం

జిల్లాలో ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది.

కారు దూకుడు..



- మంత్రి కేటీఆర్ టూర్ సక్సెస్
- పార్టీ క్యాడర్‌లో మరింత జోష్
- ఎన్నికలెప్పుడొచ్చినా గెలిచేలా.. ఎప్పటికప్పుడూ సమావేశాలు
- మరోవైపు జోరుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

నిర్మల్: ఎన్నికలకు ముందు మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ టూర్ విజయవంతం కావడంపై గులాబీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. రానున్న ఎన్నికలకు మూణ్నెళ్ల ముందే అభ్యర్థులను ప్రకటించి ఇప్పటికే ప్రజల్లోకి దూసుకెళ్తున్న అధికారపార్టీ కారు మరింత దూకుడు పెంచుతోంది. నిర్మల్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ముధోల్‌లో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఖానాపూర్ నియోజకవర్గంలో అభ్యర్థి జాన్సన్‌నాయక్ పార్టీ కార్యక్రమాలను పెంచుతున్నారు. ఎప్పటికప్పుడు పార్టీ అంతర్గత సమావేశాలు నిర్వహిస్తూ, క్యాడర్‌కు దిశానిర్దేశం చేస్తున్నారు. వీటికి తోడుగా ప్రజల నుంచి అభివృద్ధి మార్కులు కొట్టేయడానికి వడివడిగా పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు.

కేటీఆర్ పర్యటన సక్సెస్..

పలుమార్లు వాయిదా పడుతూ వచ్చిన కేటీఆర్ జిల్లా పర్యటనను బీఆర్‌ఎస్ విజయవంతం చేసింది. సదరు పార్టీ నేతలే ఊహించని విధంగా జనసమీకరణ జరగడంపైనా చర్చ జరుగుతోంది. నిర్మల్ నియోజకవర్గంలో మంత్రితో పాటు ఆయన కుమారుడు అల్లోల గౌతమ్‌రెడ్డి సభ నిర్వహణ, జనసమీకరణ తదితర ఏర్పాట్లు చూసుకున్నారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మాజీ చైర్మన్ అప్పాల గణేశ్ చక్రవర్తి, సీనియర్లు రాంకిషన్‌రెడ్డి, ధర్మాజీ రాజేందర్, ఎర్రవోతు రాజేందర్, మారుగొండ రాము, కౌన్సిలర్లు, తదితరులు నిర్వహణలో భాగమయ్యారు. ఇక బహిరంగసభకు ఖానాపూర్ నియోజకవర్గం నుంచి భారీగా జనసమీకరణ చేసినట్లు స్పష్టంగా కనిపించింది. కొత్తగా బరిలోకి దిగిన అభ్యర్థి జాన్సన్‌నాయక్ తన మిత్రుడైన మంత్రి కేటీఆర్ ముందు బలప్రదర్శన చేశారు. ముధోల్ నుంచి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, బోథ్ నియోజవర్గం నుంచి అక్కడి అభ్యర్థి అనిల్‌జాదవ్ జనసమీకరణ చేశారు.

మరింత దూకుడుగా..

అన్ని పార్టీల కంటే ముందే తమ అభ్యర్థులను ప్రకటించిన బీఆర్‌ఎస్ ఇప్పటికే ప్రజల్లోకి దొచ్చుకెళ్తోంది. నిర్మల్ నియోజకవర్గంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రతిరోజూ పర్యటిస్తూనే ఉన్నారు. ఎప్పుడూ ప్రజల్లో ఉండేలా నిత్యం బిజీ షెడ్యూల్ కొనసాగిస్తున్నారు. ముధోల్‌లో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పార్టీపరంగా కొంత తక్కువగా ఉన్నా అధికారిక కార్యక్రమాలతో ప్రజల్లో ఉంటున్నారు. ఇక ఖానాపూర్ అభ్యర్థి జాన్సన్‌నాయక్ జోరుగా ప్రచారం చేసుకుంటున్నారు. జిల్లాకు కేటీఆర్ ఐటీటవర్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, తదితర వరాలు ప్రకటిస్తే ఇంకా బాగుండేదని మెజార్టీ కార్యకర్తలు అభిప్రాయ పడుతున్నారు.

శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాల జోరు

ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న పనులూ ఇప్పుడు ముందుకు వస్తున్నాయి. ఏళ్లుగా పరిష్కారంకాని సమస్యలు ఇక శరవేగంగా తొలుగుతున్నాయి. ఎన్నికల వేళ ముంచుకొస్తుండటంతో అభివృద్ధి పనులూ వేగవంతమవుతున్నాయి. అధికారపార్టీ ఓవైపు ప్రచారంపై దృష్టి పెడుతూనే ప్రజల నుంచి అభివృద్ధి మార్కులను పొందడానికి ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా నిర్మల్ మున్సిపాలిటీకి రూ.50 కోట్ల నిధులు తీసుకువచ్చారు. సమీకృత మార్కెట్‌ను కొలిక్కి తీసుకొచ్చారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఎత్తిపోతల పథకాన్ని మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. వీటితో పాటు గల్లీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకూ జోరుగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. మరోవైపు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలంటూ నియోజకవర్గాల్లో ఎప్పటికప్పుడూ పార్టీ అంతర్గత సమావేశాలు పెడుతున్నారు.

పర్యాటక కేంద్రంగా నిర్మల్



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, వేదికపై మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, అదనపు కలెక్టర్ కిషోర్

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: నిర్మల్ పట్టణం పర్యాటకులకు కేంద్రంగా మారిందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద రూ.12 కోట్లతో నిర్మిస్తున్న హరిత టూరిజం హోటల్ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 27 గదులు, 80 మంది సామర్థ్యంతో రెస్టారెంట్, 450 మంది సామర్థ్యంతో హాల్ నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, ఎఫ్‌ఏసీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, సీనియర్ నాయకులు పాకాల రాంచందర్, లక్ష్మణ చారి, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్ రోడ్ నెంబర్ 1లో రూ.10 లక్షలతో నిర్మించనున్న అన్ని కులసంఘాల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం కాలనీ వాసులు మంత్రిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాగర్ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు కూన రమేశ్, శరత్‌రెడ్డి, మడిపెల్లి శ్రీనివాస్, సాగర్‌రెడ్డి, వంశీధర్, ఆనంద్, ఆయిండ్ల రఘు, గజేందర్, శ్రీనివాస్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో నియోజకవర్గానికి చెందిన 56 మంది లబ్ధిదారులకు మంత్రి ఐకేరెడ్డి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, హజ్ కమిటీ సభ్యులు నజీరొద్దీన్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అర్బన్‌పార్కును మరింత అభివృద్ధి చేస్తాం

సారంగపూర్: గండిరామన్న అర్బన్‌పార్కును మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. పార్కులో రూ.3 లక్షల అటవీశాఖ నిధులతో ఏర్పాటు చేసిన రెండు బోట్‌లను గురువారం సీసీఎఫ్ శరవణన్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే పార్కులో జంగిల్ సఫారి, వాకింగ్ ట్రాక్, వ్యూపాయింట్, వాకింగ్ ఫ్లెటైవర్ వే నిర్మించామన్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఈపార్కును మరింత సుందరంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. సందర్శకులకు అనువుగా మరిన్ని ఏర్పాట్లు చేపట్టి అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చాట్ల లక్ష్మి, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ప్రముఖ పారిశ్రామిక వేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ మాధవరావు, డీఎఫ్‌వో రాంకిషన్, ఎఫ్ఆర్‌వో జైపాల్‌రెడ్డి, డీఆర్‌వో శ్రీదేవి, ఎఫ్ఎస్‌వోలు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



అర్బన్‌పార్కులో బోటింగ్ చేస్తున్న మంత్రి

న్యూస్‌రీల్

మహోత్సవాలకు రావాలని మంత్రికి ఆహ్వానం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్‌టౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రం బాసర సరస్వతీమాత ఆలయంలో ఈ నెల 15 నుంచి 23 వరకు నిర్వహించనున్న శ్రీశారదీయ శరన్నవ రాత్రి (దసరా) మహోత్సవాలకు రావాలని నిర్వాహకులు మంత్రి ఐకేరెడ్డికి గురువారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా మహోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం మంత్రి దంపతులను సత్కరించి, అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

త్యాగధనులను స్మరించుకుంటూ యాత్ర



మట్టిని సేకరిస్తున్న బైక్ యాత్రికులు

నిర్మల్: దేశవ్యాప్తంగా ఎంతోమంది త్యాగధనుల ప్రాణత్యాగాలతో స్వాతంత్ర్యం సిద్ధించిందని, అలాంటి వీరులు పుట్టిన మట్టిని సేకరిస్తున్నామని ఉత్తరప్రదేశ్‌లోని వారణాసికి చెందిన డాక్టర్ ఆనంద్ శ్రీవాత్సవ్, అపూర్వ్ పేర్కొన్నారు. గతనెల 30న కాశీ నుంచి కన్యాకుమారి వరకు చేపట్టిన పావన్‌కుండ్ కలశ్ యాత్ర గురువారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్, వివిధ సంస్థలకు చెందిన పలువురు వారికి స్వాగతం పలికారు. అనంతరం వెయ్యిఉరుల మర్రి అమరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం అక్కడి మట్టిని వారు కలశంలో తీసుకున్నారు. ఇలా కాశీ-కన్యాకుమారి వరకు ఉన్న పుణ్యస్థలాల్లో మట్టిని సేకరించి తిరుగు ప్రయాణంలో మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో గల శివాజీఘాట్ వద్దకు చేరుస్తామని వివరించారు. స్వాగతం పలికిన వారిలో నూకల విజయ్‌కుమార్, గొజ్జ సుదర్శన్, శాంతిలాల్‌పటేల్, రాజేశ్వర్, తదితరులు ఉన్నారు.

బాలల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి




మాట్లాడుతున్న డీడబ్ల్యూవో రమేశ్

నిర్మల్ ఖిల్లా: బాలల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా సంక్షేమాధికారి (డీడబ్ల్యూవో) రమేశ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాలల సంక్షేమశాఖ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల పరిరక్షణ సమితి, బాలల సంక్షేమ సంఘం, బాలల సహాయ కేంద్రం హెల్ప్‌లైన్, సఖి, మిషన్ శక్తి, వికలాంగ సంక్షేమ శాఖలన్నీ సమన్వయంతో వ్యవహరిస్తూ బాలల స్నేహపూర్వక జిల్లాగా తీర్చిదిద్దాలని సూచించారు. ఆయా శాఖల ఉద్యోగులంతా విధులు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్మన్ వహీద్, సభ్యులు సైమన్ సుందర్, స్వదేశ్, అనిల్, శ్రీలత, సఖి కేంద్రం సమన్వయకర్త మమత, చైల్డ్ లైన్ సమన్వయకర్త గంగాధర్ పాల్గొన్నారు.

సదరం శిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో గురువారం ఆర్థో విభాగానికి సంబంధించి సదరం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థోపెడిక్ వైద్యులు అరుణ్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. 60 మంది దరఖాస్తు చేసుకోగా కొత్తవారు 30 మంది, రెన్యువల్ కోసం 27 మంది హాజరైనట్లు తెలిపారు.

విద్యార్థులు క్లాసులకు హాజరు కావాలి



మాట్లాడుతున్న డీఐఈవో పరశురాం

లోకేశ్వరం: ఇంటర్ విద్యార్థులు తప్పకుండా క్లాసులకు హాజరు కావాలని జిల్లా ఇంటర్ మీడియెట్ అధికారి పరశురాం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతీ విద్యార్థి సమయ పాలన పాటించాలన్నారు. చదువు పట్ల శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో అధ్యాపకులు బోధించాలన్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ తుకారాం, అధ్యాపకులు వినోద్, చిన్నయ్య, విఠల్, శ్రీనివాస్ ఉన్నారు.

‘కార్డియో’ సేవలు అందేదెప్పుడో?

- ఆర్నెళ్ల క్రితం అందుబాటులోకి టూడీఎకో పరికరం
- టెక్నీషియన్ లేక నిరుపయోగం
- అత్యవసర వేళల్లో ఇతర ప్రాంతాలకు..
- అవస్థలు పడుతున్న హృద్రోగులు

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్‌లో మెడికల్ కళాశాల ఏర్పాటుతో జిల్లా ప్రజలకు అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వచ్చినప్పటికీ కొన్నిసేవలు అందక ప్రాణాలు కోల్పోయే పరిస్థితి నెలకొంది. అత్యవసర చికిత్స అందించాల్సిన వ్యాధుల్లో గుండెజబ్బు ఒకటి. ఈ వ్యాధికి సరైన సమయంలో వైద్యం అందితే తప్ప ప్రాణాలు దక్కవు. అలాంటి వైద్యచికిత్స అందించేందుకు, గుండెలో రక్తప్రసరణ ఏ మేరకు జరుగుతుందో, ఎక్కడ బ్లాకులు ఉన్నాయనే విషయాలను తెలుసుకునేందుకు అధునాతన టూడీ ఎకో పరికరం నిర్మల్ జనరల్ ఆస్పత్రిలో ఆరునెలల క్రితం అందుబాటులోకి వచ్చింది. కానీ యంత్రాన్ని ఉపయోగించే టెక్నీషియన్ పోస్టు భర్తీ చేయకపోవడంతో ఆ పరికరం ప్రస్తుతం మూలన పడింది. దీంతో పాటుగా ఆస్పత్రిలో కార్డియాలజిస్టు వైద్యుడు సైతం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో బాధితులు ఇబ్బంది పడుతున్నారు. నిర్మల్‌లోని ప్రైవేటు ఆస్పత్రుల్లో రాత్రి 12 గంటల తర్వాత వైద్యులు అందుబాటులో ఉండరు. జనరల్ ఆస్పత్రిలో కార్డియాలజిస్టు లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో నిజామాబాద్, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఈలోగా హృద్రోగుల ప్రాణాలు హరీమంటున్నాయి. ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్లలో టూడీఏకో కు సంబంధించిన పరీక్ష చేయాలంటే రూ.2,500 వరకు ఖర్చవుతాయి. ప్రభుత్వ ఆస్పత్రిలో ఆ పరికరం ఉన్నా పరీక్షలు చేసే టెక్నీషియన్, కార్డియాలజిస్టు వైద్యుడు లేక పేదలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.



నిరుపయోగంగా టూడీఎకో పరికరం

టీ హబ్‌లో ఐదుగురే టెక్నీషియన్లు

జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రుల నుంచి రక్త నమూనాలు టీ హబ్‌కు చేరుతాయి. కానీ వాటిని పరీక్షించి సకాలంలో రిపోర్టులు అందించేందుకు సరైన టెక్నీషియన్లు లేరు. రిపోర్టులు వచ్చిన తర్వాతే ఏ డాక్టరైనా వైద్య సేవలు మొదలు పెడతారు. అయితే టీ హబ్‌లో 15 మంది ల్యాబ్ టెక్నీషియన్లు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఐదుగురు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. సిబ్బంది కొరతతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

136 పరీక్షలకు 74 మాత్రమే...

జనరల్ ఆస్పత్రిలోని టీహబ్‌లో గతంలో 54 రకాల రక్త పరీక్షలు నిర్వహించేవారు. గత జూలై నుంచి 136 రకాల పరీక్షలు నిర్వహించేలా అప్‌గ్రేడ్ అయింది. కానీ సిబ్బంది లేక 74 రకాల సేవలు మాత్రమే ప్రస్తుతం నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ హబ్‌లో ఫార్మసిస్ట్, కాంటిజంటన్ వర్కర్, మైక్రో బయాలజీ, 10 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

నిరుపయోగంగా అల్ట్రాసౌండ్ పరికరం

వైద్యులు లేక రేడియాలజీ విభాగంలో 2డీ ఎకో, అల్ట్రాసౌండ్ పరికరం నిరుపయోగంగా ఉన్నాయి. ప్రస్తుతం రేడియాలజీ విభాగంలో మామోగ్రామ్, ఎక్స్‌రే, ఈసీజీ సేవలు మాత్రమే కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి జిల్లా జనరల్ ఆస్పత్రిలో అల్ట్రాసౌండ్, టూడీఎకో సేవలు అందించాలని జిల్లాలోని నిరుపేద ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి అల్ట్రాసౌండ్ సేవలు



జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో సీనియర్ రెసిడెంట్ల ద్వారా శుక్రవారం నుంచి అల్ట్రాసౌండ్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. టూడీఎకోకు సంబంధించి రేడియాలజిస్టు అందుబాటులో లేకపోవడం వలన సేవలు ప్రారంభించడం లేదు. నియామకాలు చేపట్టాలని పైఅధికారుల విన్నవించాం. ప్రస్తుతం రేడియాలజీ హబ్‌లో మామోగ్రామ్, ఈసీజీ, ఎక్స్‌రే సేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ సునీల్, జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

విద్యార్థులకు అల్పాహారం

- నేడు ప్రారంభించనున్న మంత్రి ‘అల్లోల’

నిర్మల్‌రూరల్: రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేస్తూ ముఖ్యమంత్రి మరో చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. దసరా కానుకగా శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని తరగతుల విద్యార్థులకు ‘ముఖ్యమంత్రి అల్పాహార పథకం’ ప్రారంభం కానుంది. ఈ మేరకు సీఎం బ్రేక్ ఫాస్ట్ మెనూ ఖరారైంది. ముఖ్యమంత్రి కేసీఆర్ మహేశ్వరం నియోజకవర్గం రావిర్యాల జెడ్పీహెచ్‌ఎస్‌లో ఈ పథకాన్ని ఉదయం 8:45 గంటలకు ప్రారంభించనున్నారు. జిల్లాలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ప్రారంభించనున్నారు. జిల్లాలోని 735 పాఠశాలల్లో 42,755 మంది విద్యార్థులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందనున్నారు. పాఠశాల ప్రారంభానికి 45 నిమిషాల ముందే అల్పాహారం అందించనున్నారు.

నేడు ప్రారంభం

నిర్మల్ నియోజకవర్గంలోని సోన్ ప్రాథమిక పాఠశాలలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ విజయలక్ష్మి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి ప్రారంభిస్తారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని సుర్జాపూర్ ఎంపీపీఎస్ పాఠశాలలో ఎమ్మెల్యే రేఖాశ్యాం నాయక్, ముథోల్ నియోజకవర్గంలోని దేహగామ్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభిస్తారని డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. దసరా సెలవుల అనంతరం అక్టోబర్ 24 నుంచి ప్రతిరోజు పాఠశాలలో క్రమం తప్పకుండా అల్పాహార పథకాన్ని అమలు చేస్తామన్నారు.



అల్పాహారం మెనూ పోస్టర్

అల్పాహారం మెనూ ఇదే..

సోమవారం: ఇడ్లీ సాంబార్ లేదా గోధుమ రవ్వ ఉప్మా, చట్నీ

మంగళవారం: పూరి, ఆలుకుర్మ లేదా టమాటా బాత్ విత్ రవ్వ, చట్నీ

బుధవారం: ఉప్మా, సాంబార్ లేదా కిచిడీ, చట్నీ

గురువారం: మిల్లెట్ ఇడ్లీ, సాంబార్ లేదా పొంగల్, సాంబార్

శుక్రవారం: ఉగ్గాని/ పోహా/మిల్లెట్ ఇడ్లీ, చట్నీ లేదా గోధుమ రవ్వ కిచిడీ, చట్నీ

శనివారం: పొంగల్/సాంబార్ లేదా వెజిటబుల్ పొలావ్, ఆలు కుర్మ

పట్టుపట్టారు.. కొలువు కొట్టారు..

పోలీస్ కావాలనే పట్టుదలతో శ్రమించారు. కృషి, పట్టుదల ఉంటే సాధించనిదంటూ ఏదీ ఉండదని నిరూపించారు. బుధవారం విడుదలైన కానిస్టేబుల్ ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు యువతీ యువకులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు.



వెన్ను భాగ్యరాజ్



తాట్ల సుజీన్



దీక్షిత్ సాయిశ్రావణి



సాయికృష్ణ

దిలావర్‌పూర్/తానూర్/భైంసా/భైంసారూరల్/లోకేశ్వరం/ఖానాపూర్/సోన్: దిలావర్‌పూర్ మండలంలోని సిర్గాపూర్ గ్రామానికి చెందిన బోడిగామ విజయ్‌కుమార్, ఇప్ప అన్వేష్, ఇట్టెడి నారాయణరెడ్డి, బొంపాల సాయికృష్ణ, కాల్వ తండాకు చెందిన జాదవ్ శివాజీ నాయక్, న్యూలోలం గ్రామానికి చెందిన సాయిలు, తానూరు మండలంలోని భోసి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీజవాన్ బాయి సాయినాథ్, భైంసా మండలం ఇలేగాం గ్రామానికి చెందిన పెర్తన్‌పల్లి అఖిలేశ్, మిర్జాపూర్ గ్రామానికి చెందిన బొర్గం శివ, చింతల్‌బోరికి చెందిన గంట వనిత, మహాగాం గ్రామానికి చెందిన పార్థసారథి, దేగాం గ్రామానికి చెందిన ప్రశాంత్, కోతల్‌గాం గ్రామానికి చెందిన సట్ల నవీన్, బాసరకు చెందిన దీక్షిత్‌సాయిశ్రావణి, లోకేశ్వరం మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్, తాట్ల సుజీన్, ధర్మోరా గ్రామానికి చెందిన వెన్ను భాగ్యరాజ్, ఖానాపూర్ మండలంలోని రాజూరాకు చెందిన దుర్గాప్రసాద్, సోన్ మండలంలోని మాదాపూర్‌కు చెందిన హన్మత్ ప్రశాంత్, మార సాగర్‌రెడ్డి, అన్వడొల్ల సురేష్, ఎలిగేటి హరీష్, సంతసాయి పరిమళ, మార సింధుజ, బొప్పారంకు చెందిన టీ.రాజు, పి.దీపిక కానిస్టేబుళ్లుగా ఉద్యోగం సాధించారు. వీరితో పాటు మరికొంతమంది జిల్లా యువతీ యువకులు కొలువులు సాధించారు.

- వివరాలు 8లో▸

మంత్రులిద్దరూ క్షమాపణ చెప్పాలె

- డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు

నిర్మల్: ‘నేను చాలెంజ్ చేస్తున్నా.. మంత్రులు కేటీఆర్, ఐకేరెడ్డి రండి.. బుధవారం మీరు ప్రారంభించిన గుండంపల్లి పంప్‌హౌజ్ మోటార్ల దగ్గరికి వెళ్దాం. నేను మోటార్లలో వేలు పెడతా.. ఒకవేళ కరెంటు ఉంటే నేను అక్కడే చచ్చిపోతా. కరెంటు లేకుంటే.. మరి మీరు ఆ పంప్‌హౌస్ కాలువలో దూకి చస్తారా..’ అని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు ధ్వజమెత్తారు. జిల్లా టూర్‌లో మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై గురువారం తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కౌంటరిచ్చారు. రైతులు, ప్రజలకు ఇరవై నాలుగు గంటలపాటు కరెంటు అందడం లేదని అడిగిన పాపానికి.. వైర్లు పట్టుకుంటే కరెంటు ఉన్నదో లేదో తెలుస్తుందంటూ పరోక్షంగా కాంగ్రెసోళ్లను చావమని చెప్తావా కేటీఆర్ అని మండిపడ్డారు. ఇటీవల గుండంపల్లిలో అసంపూర్తిగా ఉన్న లక్ష్మీనర్సింహస్వామి ఎత్తిపోతల పథకానికి తాత్కాలికంగా కరెంటు అందించి ప్రారంభోత్సవం చేసి ప్రజలు, రైతులను మోసం చేశారన్నారు. తాత్కాలిక కరెంటుతో, అసంపూర్తి పనులతో మోసగించిన మంత్రులు వెంటనే ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ సీనియర్ నేతలు సాదసుదర్శన్, వాజిద్ అహ్మద్‌ఖాన్, అజర్, నాందేడపు చిన్ను, గాజుల రవి తదితరులు పాల్గొన్నారు. కాగా ఎత్తిపోతల పథకానికి తాత్కాలిక కరెంటు అందించారన్న శ్రీహరిరావు ఆరోపణపై ఎస్ఈ చౌహాన్‌ను వివరణ కోరగా రూ.2కోట్ల 10లక్షలు కడితే రెగ్యులర్ కనెక్షన్ ఇస్తామని, ప్రస్తుతం నెలవరకు తాత్కాలిక కనెక్షన్ కొనసాగుతుందని చెప్పారు.



మాట్లాడుతున్న శ్రీహరిరావు

పట్టుపట్టారు.. కొలువు కొట్టారు



వారంతా పాతికేళ్లలోపు యువతీయువకులు. ఖాకీ కొలువంటే ఎంతో ఇష్టపడ్డారు. అందుకు తగ్గట్టు కష్టపడ్డారు. దీంతో తమ కల నెరవేరింది. గతేడాది పోలీస్ కానిస్టేబుల్ నియామకాల కోసం నోటిఫికేషన్ విడుదల కాగా జిల్లాలోని వేలాదిమంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి నుంచి అనేక ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటూ ఫిజికల్ టెస్టులు, రాత పరీక్షలకు సిద్ధమై పరీక్షలను ఎదుర్కొన్నారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పోలీస్ కానిస్టేబుల్ కొలువులు సాధించిన అభ్యర్థుల మనోగతం..

ఖాకీ కొలువుకు అతివలు సైతం...

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా నుండి వందలాదిమంది మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 40మంది మహిళలు వివిధ విభాగాల్లో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలను దక్కించుకున్నారు.

- నిర్మల్ పట్టణంలోని కావేరి గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమైన వారిలో 12మంది అభ్యర్థులు పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో సత్తా చాటారు. ఇందులో రాకేష్, సాయి, శివ, ప్రకాష్, ఉదయ్, సునీల్, కిరణ్, రమణ, గోపి, సమీరుద్దీన్, జి.ఉదయ్, ఇమ్రాన్ ఉన్నారు.

అమ్మకు బహుమతిగా..



తల్లితో నరిమెట్ల వంశీ

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ కాలనీకి చెందిన 'నరిమెట్ల వంశీ' కష్టపడి చదివి సివిల్ కానిస్టేబుల్ పోలీసు ఉద్యోగాన్ని సాధించాడు. చిన్నప్పుడే అయినవారందరికీ దూరంగా ఉంటూ ఇద్దరి బిడ్డల్ని మిషన్ కుట్టుకుంటూ చదివించింది. మంచి ప్రయోజకులను చేయాలనే ఆ తల్లి ఆలోచనను వంశీ నెరవేర్చి పోలీసు ఉద్యోగాన్ని అమ్మకు బహుమతిగా ఇచ్చాడు.

ఆటో డ్రైవర్ కొడుకు..



నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని వెంకటాద్రిపేట్ కాలనీకి చెందిన ఆకుల శశాంక్ ఇటీవల వెల్లడించిన కానిస్టేబుల్ ఫలితాల్లో ఎంపికయ్యాడు. తండ్రి రవి కుటుంబ పోషణకు ఆటో నడుపుతూ ఉండగా తల్లి గోదావరి గృహిణి. తన అన్నయ్య శశిప్రీతం బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరాడు. శశాంక్ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక కావడంపై పలువురు అభినందిస్తున్నారు. - ఆకుల శశాంక్

అమ్మానాన్నల కోరిక నెరవేర్చాడు



తాంసి: చిన్నప్పుడే అనారోగ్యంతో అమ్మానాన్నలు మృతిచెందారు. మాది తాంసి కాగా 5వ తరగతిలో అనారోగ్యంతో తండ్రి రాజన్న, రెండేళ్ల వ్యవధిలోనే తల్లి నాగమ్మ మృతిచెందింది. దీంతో ఇద్దరు పిల్లలు రజిత, రాహుల్ బాధ్యతను అమ్మమ్మ జింక లక్ష్మి తీసుకుంది. కూలీ పనులు చేస్తూ మమల్ని చదివించింది. మా అక్క రజితకు వివాహం చేసింది. ప్రస్తుతం కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను.

అమ్మమ్మ జింక లక్ష్మితో బట్టు రాహుల్

ఆటో నడుపుతూ...



తాంసి: కుటుంబ పోషణకు ఆటో నడుపుతున్నాను. మాది మండలంలోని బండల్‌నాగాపూర్ గ్రామం. ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నాను. కుటుంబ పోషణ కోసం 2016నుంచి ఆటో నడుపుతున్నాను. 2016లో హైదరాబాద్‌లో శిక్షణ పొంది ఈవెంట్స్‌లో ఉద్యోగం చేజారింది. 2018లో రెండు మార్కుల్లో ఉద్యోగం రాలేదు. ఈసారి నోటిఫికేషన్ వెలువడగానే ఆటో నడుపుతూ ఇంటి వద్దనే సన్నద్ధమయ్యాను. టీఎస్ఎస్‌పీ కానిస్టేబుల్‌గా ఉద్యోగం వచ్చింది. -బండి కిషోర్

వరిస్తున్న ప్రభుత్వ ఉద్యోగాలు



తాంసి: ప్రభుత్వ ఉద్యోగం వస్తే చాలు అనుకునే రోజుల్లో వరుసగా ఇప్పటికే మూడు ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయి. ఆదిలాబాద్ రూరల్ మండలం తంతోలి గ్రామం మాది. 2017లో గురుకులాల డీఎస్సీలో ప్రతిభ కనబర్చాను. 2018లో కానిస్టేబుల్, జూనియర్ పంచాయతీ కార్యదర్శి పరీక్ష రాయగా 2ఉద్యోగాలకు ఎంపిక కాగా కార్యదర్శిగా ఉద్యోగంలో చేరాడు. ప్రస్తుతం టీఎస్ఎస్‌పీ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. - ఫిరంగి అజయ్‌కుమార్

తండ్రి లేకున్నా మనోధైర్యంతో....



అరిగెల సోని



చౌహాన్ నిశిత



సంధ్యారాణి

కుంటాల: మండలంలోని కల్లూర్‌కు చెందిన అరిగెల సోని తండ్రి గజ్జారాం చిన్నప్పుడే మృతి చెందాడు. తల్లి భోజవ్వ మతిస్థిమితం కోల్పోయింది. అమ్మమ్మ లచ్చవ్వతో కూలీ పనులకు వెళ్తూనే చదువుకుని కానిస్టేబుల్ ఉద్యోగం సాధించింది.

- కల్లూర్‌కు చెందిన చంద్రబాయి భర్త సంతోష్‌లకు ముగ్గురు ఆడపిల్లలే. వీరి చిన్నతనంలోనే తండ్రి మృతిచెందాడు. తల్లి కష్టపడి పెద్దకూతురు వివాహం చేసింది. చిన్న కూతురు చౌహాన్ నిశిత ఉద్యోగం సాధించింది.
- కుంటాలకు చెందిన గడ్డం లక్ష్మి–పోశెట్టిలకు ఇద్దరు కూతుళ్లు. తండ్రి పోశెట్టి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి లక్ష్మి బీడీలు చుడుతూ కుటుంబాన్ని నెట్టుకొచ్చింది. కూతురు సంధ్యారాణి కొలువు సాధించింది.

తల్లి కష్టానికి దక్కిన ఫలితం



మామడ: మండలంలోని ఆదర్శ నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని న్యూటెంబుర్ని గ్రామానికి చెందిన కుర్మ రాజారెడ్డి, నర్సవ్వ దంపతుల కూతురు నిరోషరెడ్డి ఏఆర్ పోలీస్ ఉద్యోగానికి ఎంపికైంది. తండ్రి మరణించడంతో తల్లి నర్సవ్వ బీడీలు, వ్యవసాయ కూలీ పనులు చేస్తూ చదివించింది.

- మామడ మండలంలోని పొన్కల్ గ్రామానికి నారాయణ, ముత్తవ్వ దంపతుల కూమార్తె బి.పల్లవి సివిల్ కానిస్టేబుల్‌కు ఎంపికైంది.
- అనంతపేట్ గ్రామానికి చెందిన నిట్ట ఎర్రన్న, ముత్తవ్వ దంపతుల కుమారుడు నిట్ట విజయ్ ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు.
- పొన్కల్ గ్రామానికి చెందిన కుంబాల రాజారెడ్డి పద్మ దంపతులు కుమారుడు రాజు ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా కొలువుసాధించాడు.
- అనంతపేట గ్రామానికి చెందిన నిట్ట విజయ్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు.

సోదరుడి ప్రోత్సాహంతో..



బేల: అన్న ప్రసన్నకుమార్ ప్రోత్సాహంతోనే ఉద్యోగం సాధించాను. ఎయిర్ ఫోర్స్‌లో ఉద్యోగం సాధించాలని సంసిద్ధమయ్యాను. కానీ కరోనా కారణంగా వయస్సు అర్హతను కోల్పోయాను. కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాను.
- ఎనగందుల స్వజల్‌కుమార్, అవాల్‌పూర్

- నిరుపేద కుటుంబానికి మండలంలోని అవాల్‌పూర్ గ్రామానికి చెందిన ముక్కే వికాస్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు.

అన్నదమ్ములను వరించిన ఉద్యోగాలు..

సిరికొండ: మండలంలోని ధర్మసాగర్ గ్రామానికి చెందిన రాథోడ్ మోతిలాల్–లక్ష్మీబాయి దంపతుల కుమారులు రాథోడ్ నాందేవ్, రాథోడ్ అర్జున్‌లకు కానిస్టేబుల్ ఫలితాల్లో ప్రభుత్వ కొలువులు వరించాయి.

తండ్రి కష్టం ఫలించింది



ఇంద్రవెల్లి: నాన్న కావటి రాములు టైలరింగ్, అమ్మ లలిత కూలీ పనికి వెళ్లి నన్ను చదివించారు. వారి కష్టాలను దూరం చేయాలనే లక్ష్యంతో డిగ్రీ చదువుతూనే కానిస్టేబుల్ ఉద్యోగం కోసం ప్రయత్నం చేశాను. రెండో ప్రయత్నంలో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాను. నా తల్లిదండ్రులు పడిన కష్టానికి తగిన ఫలితం దక్కింది.
- కావటి రూపేష్, ముత్నూర్

- ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ గ్రామానికి చెందిన దుర్వ సంజు అన్నదమ్ముల స్ఫూర్తితో రెండో ప్రయత్నంలో కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు.

క్లుప్తంగా

రాష్ట్ర మేనిఫెస్టో కమిటీ కన్వీనర్‌గా 'ఏలేటి'



ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డా ఆదేశానుసారం భారతీయ జనతా పార్టీ ఎన్నికల మేనిఫెస్టో కమిటీ కన్వీనర్‌గా మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మేనిఫెస్టో తయారీతో పాటు ప్రచార కమిటీకి కూడా ఆయన కన్వీనర్‌గా కొనసాగనున్నారు. పార్టీలో చేరిన అనతికాలంలోనే ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి రాష్ట్ర స్థాయి ముఖ్యమైన బాధ్యత రావడంపై పార్టీ జిల్లా నాయకులు, ఆయన అనుచరులు హర్షం వ్యక్తం చేశారు.

కబడ్డీ పోటీల్లో జోనల్‌స్థాయికి ముధోల్ విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ముధోల్: కబడ్డీ పోటీల్లో జోనల్ స్థాయికి ముధోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు వినయ్, సాయిలు ఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల లక్ష్మణ్‌చాంద ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ – 14 కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జోనల్‌స్థాయికి ఎంపికయ్యారు. వీరిని పలువురు అభినందించారు.

మొక్కజొన్న పంట ధ్వంసం



కిందపడిపోయిన మొక్కజొన్న పంట

కుభీర్: మండలంలోని హల్దా గ్రామంలో చెదల సాయన్నకు చెందిన మొక్కజొన్న పంటను బుధవారం రాత్రి అడవి పందులు గుంపుగా వచ్చి సుమారు రెండు ఎకరాల వరకు ధ్వంసం చేసినట్లు రైతు తెలిపాడు. మొత్తం నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. తనకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతు సాయన్న కోరుతున్నాడు.

పేకాట స్థావరంపై దాడి

సిరికొండ: పేకాట స్థావరంపై దాడిచేసి ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండలంలోని పొన్న ఎక్స్‌రోడ్డులోని దాబాలో పేకాటాడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. ఇందులో ఇచ్చోడ, సిరికొండ, ఇంద్రవెల్లి వాసులు ఉన్నట్లు తెలిపారు.

'ఇంద్రకరణ విజయం' ఆవిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న మంత్రి, కవులు

నిర్మల్‌టౌన్: మూడున్నర దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సాధించిన అభివృద్ధిని ప్రస్తావిస్తూ కవి పండితుడైన బొందిడి పురుషోత్తంరావు రచించిన 'ఇంద్రకరణ విజయం' అర్ధశత కావ్యాన్ని మంత్రి నివాసంలో గురువారం మంత్రితో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పురుషోత్తంరావు మాట్లాడుతూ.. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి హయాంలో నిర్వహిస్తున్న అభివృద్ధికి, ప్రజాసేవకు ముగ్ధుడై అంతఃకరణ శుద్ధితో మనస్ఫూర్తిగా రాసిన కావ్యమే 'ఇంద్రకరణ విజయం' అని పేర్కొన్నారు. ముందుమాటను ప్రముఖ కవి, కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు రచించాడు. అనంతరం కవులను మంత్రి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కవులు పత్తి శివప్రసాద్, నేరెళ్ల హనుమంతు, విశ్రాంత ఎంపీడీవో చాట్ల గజ్జారాం, ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

చీడపీడల నివారణపై అవగాహన



రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు

ఎడులాపురం: పత్తిలో గులాబీరంగు పురుగు ఉధృతి నివారించుకోవడానికి రైతులు ఎకరానికి 8 లింగాకర్షక బుట్టలు అమర్చుకోవాలని కేవీకే కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కేంద్రీయ పత్తి పరిశోధన స్థానం నాగ్‌పూర్ ఆర్థిక సహకారంతో 'అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు' అనే ప్రాజెక్టులో భాగంగా జిల్లా కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం పత్తిలో చీడపీడల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గులాబీరంగు పురుగు ఉధృతి నివారణకు తీసుకోవాల్సిన పద్ధతులు, సూచనలను రైతులకు తెలియజేశారు. లింగాకర్షక బుట్టలతో పాటు ఎమమెక్టిక్ బెంజోయెట్ 0.5 గ్రాములు లేదా క్లోరంత్ర నిలిప్రోల్ 0.3 మిల్లీ మీటర్లు లేదా థయోడికార్బ్ 1.5 గ్రాములు లేదా క్లోరోపైరిఫాస్ 20 ఈసీ 2.5 మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. అనంతరం శాస్త్రవేత్త రాజశేఖర్ ఎత్తుమడుల పద్ధతి, కాయ కుళ్లు, తెల్లదోమ నివారణ చర్యలు వివరించారు. రైతులకు లింగాకర్షక బుట్టలు పంపిణీ చేశారు.

రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం



రైల్వే ట్రాక్‌పై మృతదేహం

భైంసా: బాసర గోదావరి నది సమీపంలోని యంచ గ్రామ శివారులో రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తించినట్లు హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ తెలిపారు. మృతుడి వయసు 35 నుంచి 40 ఉంటాయని వివరించాడు. రైలు ప్రమాదంలో చనిపోయి ఉంటాడని వివరాలు తెలిస్తే 87126 58591, 8712568510 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య



రాందాస్ మృతదేహం

లక్ష్మణచాంద: జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పీచర గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... మండలంలోని పీచర గ్రామానికి చెందిన పిట్టల రాందాస్ (28) కూలీ పనిచేసి జీవనం సాగించేవాడు. కొద్ది రోజుల నుంచి మద్యానికి బానిసై ఇంటివద్దే ఉంటున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో గుర్తు తెలియని పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన భార్య గంగమ్మ నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం సాయంత్రం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

పాముకాటుతో ఒకరి మృతి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అనుకుంట గ్రామంలో నివాసముంటున్న చౌహాన్ రాజు(32) పాముకాటుతో మృతి చెందినట్లు ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ గోవింద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని మహుర్ తాలుక కార్తర్‌సింగ్ తండాకు చెందిన రాజు అనుకుంట గ్రామంలో సిమెంట్ ఇటుకల తయారీ చేసే ఫ్యాక్టరీలో మూడు నెలల నుంచి పని చేస్తున్నాడు. ఇదే క్రమంలో గురువారం వేకువజామున 2.30 గంటల ప్రాంతంలో పాముకాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఉదయం 9గంటలకు మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు, భార్య సుచిత ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

పరామర్శ

సిర్పూర్(టి): మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన యువకుడు బూరం చెన్నమల్లు అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. బీజేపీ నియోజకవర్గ నాయకుడు పాల్వాయి హరీశ్‌బాబు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకు ముందు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన వెంట నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

కిడ్నీలో 120రాళ్లు..



కిడ్నీలో నుంచి తీసిన రాళ్లు

నిర్మల్: ఒకటికాదు.. రెండుకాదు.. ఏకంగా వందా ఇరవైరాళ్లు. అవి కూడా ఒకే కిడ్నీలో.. చదువుతుంటేనే ఆశ్చర్యంగా ఉంది కదా..! ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అరవై ఏళ్ల ఓ వృద్ధుడు కిడ్నీలో రాళ్ల సమస్యతో ఎన్నో ఆస్పత్రులు తిరిగాడు. ఎన్నో మందులు వాడాడు. ఫలితం మాత్రం దక్కలేదు. ఆపరేషన్ చేయించుకునే స్తోమత లేక అలాగే నొప్పి భరిస్తూ వచ్చాడు. చివరకు నిర్మల్‌లోని స్వప్న మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవల తెలుసుకుని వచ్చాడు. ఇక్కడ యూరాలజిస్ట్ శ్రావణ్‌కుమార్ సదరు బాధితుడిని పూర్తిగా పరీక్షించి ఆపరేషన్ చేశారు. ఇక వైద్యులే ఆశ్చర్యపోయేలా.. ఏకంగా వందకు పైగా రాళ్లు ఆయన కిడ్నీలో నుంచి బయటపడ్డాయి. ప్రస్తుతం సదరు బాధితుడు బాగున్నాడని ఆస్పత్రి వైద్యులు శ్రావణ్‌కుమార్, నాళం శశికాంత్ పేర్కొన్నారు. హైదరాబాద్, నిజామాబాద్ వంటి నగరాలకు వెళ్లే అవసరం లేకుండా ఇక్కడే ఇలాంటి అరుదైన చికిత్సలనూ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా పొందవచ్చని వివరించారు.

అనారోగ్యంతో గర్భిణి మృతి

కాగజ్‌నగర్‌టౌన్: అనారోగ్యంతో నిండు గర్భిణి మృతిచెందిన ఘటన పట్టణంలోని న్యూకాలనీ గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఎస్పీఎం ఉద్యోగి సతీష్ సతీమణి మీనా(30) పురుటినొప్పులతో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చేరింది. పరిస్థితి విషమించడంతో స్థానిక వైద్యుల సూచనలు మేరకు రెండు రోజుల క్రితం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. బుధవారం రాత్రి పచ్చ కామెర్ల వ్యాధి తీవ్రమై చికిత్స పొందుతూ పురుటినొప్పుల్లోనే శిశువు మృతిచెందగా ఆ తర్వాత తల్లి తుదిశ్వాస వదిలింది. మృతురాలికి రెండు సంవత్సరాల పాప ఉంది. బాధిత కుటుంబాన్ని బీజేపీ నాయకులు డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు, కొంగ సత్యనారాయణ పరామర్శించారు.

ఒకరికి గాయాలు

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా గ్రామంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆత్రం బాపురావుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం... బాపు గ్రామంలోని ప్రధాన రహదారిపై బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. స్థానికులు 108లో కాగజ్‌నగర్‌కు తరలించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఆశ్రమ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దస్తురాబాద్: మండల కేంద్రానికి చెందిన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఉట్నూర్‌లో డివిజన్ స్థాయిలో జరిగిన ట్రైబల్ స్పోర్ట్స్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాథోడ్ శ్రీనివాస్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన కె.జారుబాయి(వాలీబాల్), టి.మల్లిక (కబడ్డీ), ఎం.శైలజ(కబడ్డీ)రాష్ట్ర స్థాయిలో జరిగే ట్రైబల్ స్పోర్ట్స్‌కు ఎంపిక కావటం సంతోషకరమన్నారు. ఎంపికై నా విద్యార్థులను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు పవార్ స్వర్ణలతను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది చందు, అనిల్, ధర్మసింగ్, వనిత, సంపూర్ణ, స్వరూపరాణి, సునీత పాల్గొన్నారు.

వడూర్‌లో డెంగీ కేసు నమోదు



మందు పిచికారీ చేయిస్తున్న వైద్యసిబ్బంది

తాంసి: భీంపూర్ మండలంలోని వడూర్ గ్రామంలో డెంగీ కేసు నమోదైంది. గ్రామానికి చెందిన ఐదేళ్ల చిన్నారికి డెంగీ సోకడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. గురువారం మండల వైద్యాధికారి నిఖిల్‌రాజ్ సిబ్బందితో కలిసి గ్రామాన్ని సందర్శించారు. డెంగీ సోకిన ఇంటి పరిసరాల చుట్టూ రసాయన మందు పిచికారీ చేయించారు. ఇళ్ల చుట్టూ నీరునిల్వ ఉండకుండా చూడాలని చెప్పారు. వారి వెంట హెచ్ఈవో జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ గంగాధర్, వైద్య సిబ్బంది దివ్య, ప్రవీణ్ ఉన్నారు.

గ్రామాల్లో ప్రబలుతున్న విషజ్వరాలు

- విషజ్వరంతో ఒకరి మృతి
- ఇప్పగూడెంలో వైద్య శిబిరం



వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం, వాతావరణ మార్పులతో గ్రామీణులు జ్వరాల బారిన పడుతున్నారు. మండలంలోని బుధాకుర్దు గ్రామ పంచాయతీ పరిధిలోని ఇప్పగూడెంకు చెందిన చీకటి వెంకటేష్(30) మూడు రోజుల నుంచి విషజ్వరంతో బాధపడుతూ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వెంకటేశ్‌కు ఎనిమిది నెలల క్రితం వివాహమైంది. గ్రామంలోని పలువురికి విషజ్వరాలు రావడంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గురువారం తాళ్లగురిజాల గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 35మందికి రక్త పరీక్షలు చేసి ఐదుగురికి జ్వరాలు ఉన్నట్లు నిర్ధారించినట్లు పీహెచ్‌సీ వైద్యుడు అనిష్ తెలిపారు. దీంతో పాటు గ్రామంలో డ్రై డే నిర్వహించి మురుగునీరు నిల్వ ఉన్న చోట్ల శుభ్రం చేశారు.

స్నేహితుడి మరణాన్ని జీర్ణించుకోలేక ఆత్మహత్య



మోహన్‌యాదవ్(ఫైల్)

జైపూర్: వారిద్దరూ ప్రాణ స్నేహితులు. చిన్ననాటి నుంచి కలిసి పెరిగారు. ఓ స్నేహితుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోగా మరో స్నేహితుడి జీర్ణించుకోలేక మూడు రోజుల కిందట గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడగా గురువారం టేకుమట్ల శివారులో మృతదేహం కనిపించింది. వివరాల్లోకి వెళ్తే... శ్రీరాంపూర్ ఆర్కే–8కాలనీకి చెందిన చందనవేని మోహన్‌యాదవ్ (27) అదే కాలనీకి చెందిన జీజుల అఖిల్ ఇద్దరూ చిన్ననాటి నుంచి మంచి స్నేహితులు. అఖిల్ తండ్రి ఏడాదిన్న కిందట మరణించడంతో తండ్రి సింగరేణి ఉద్యోగం అఖిల్‌కు వచ్చింది. అఖిల్‌కు ఈ ఏడాది జూన్‌లో వివాహం కాగా ఎప్పటికి బయట స్నేహితులతో తిరుగుతుండడంతో కుటుంబ సభ్యులు మందలించారు. మనస్తాపానికి గురైన అఖిల్ ఈ నెల 2వ తేదీన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్నేహితుడి మరణ వార్త తెలుసుకున్న మోహన్ మనస్తాపానికి గురై అదే రోజు ఇందారం గోదావరి వద్ద వంతెన పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం మోహన్ మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.